క్లుప్తంగా

ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహం వితరణ



రామచంద్రాపురం: మండలంలోని పీవీ పురం పంచాయతీ బలిజపల్లెకు చెందిన పల్లవి, శంకరయ్య దంపతులు రాయలచెరువుకట్ట సమీపంలోని శ్రీభవానీ శంకరుల ఆలయానికి ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాన్ని గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆంజనేయస్వామి విగ్రహానికి పంచద్రవ్యాలతో అభిషేకించి, స్నపన తిరుమంజనం చేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామచంద్రాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహ్మద్ రఫీ తెలిపారు. అన్ని శాఖలపై సమీక్ష చేయనున్నట్లు చెప్పారు. సంబంధిత అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలన్నారు.

రేపు పాకాల మండల మీట్

పాకాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమేష్‌బాబు తెలిపారు. ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తామని తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ఎంపీ గురుమూర్తి, శాప్ కార్పొరేషన్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్ మంజుల, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీ గురుమూర్తి, శాప్ కార్పొరేషన్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

శనగల కొనుగోలు కోసం టీటీడీ పరిశీలన

ఇంకొల్లు (ప్రకాశం జిల్లా): టీటీడీ ఆలయానికి శనగల కొనుగోలు చేసేందుకు టీటీడీ, మార్క్‌ఫెడ్, ప్రకృతి వ్యవసాయం అధికారుల బృందం గురువారం ఇంకొల్లు గ్రామానికి వచ్చారు. ఇందుకోసం టీటీడీ ఆలయం అధికారులు ఇంకొల్లులో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సేంద్రియ ఎరువులతో పండించిన సుమారు 2 క్వింటాళ్ల శనగలను కొనుగోలు చేశారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో శనగ పంటను సాగు చేసిన రైతు కాసు శ్రీనివాసరెడ్డి నుంచి శనగలను సేకరించి ఇంకొల్లు మహాలక్ష్మి దాల్‌మిల్‌లో పప్పును వేసి ఏ మేర దాని నుంచి నాణ్యమైన శనగపప్పు వస్తుందనే విషయాన్ని వారు పరిశీలించారు. అనంతరం టీటీడీ ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో సమాచారాన్ని అందిస్తామన్నారు. టీటీడీ ఆదేశానుసారం ఇంకొల్లులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేస్తున్న శనగలను కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చే అవకాశం ఉంటుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం వాణిశ్రీ తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ బృందం సీపీవీఓ కే శేషశైలేంద్ర, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఆర్ఎస్ఎస్‌వీఆర్ సుబ్రమణ్యం, జనరల్ మేనేజర్ పీ మురళీకృష్ణ, ఈఈ బీ జయరాం నాయక్, మార్క్‌ఫెడ్ అధికారులు డీఎం కరుణశ్రీ, ఈఈ వెంకటాచలం, మేనేజర్ నళినీదేవి, ఏఈ శ్రీనివాస్, టీఎల్ ప్రభాకర నాయుడు, ఆర్‌పీసీ వెంకటరావు, ఏపీఎం వాణిశ్రీ పాల్గొన్నారు.

అన్నప్రసాదం డిప్యూటీ ఈఓగా రాజేంద్రకుమార్



రాజేంద్రకుమార్, సెల్వంను సన్మానించిన ఏఈఓ గోపినాథ్

తిరుమల: తిరుమల మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం విభాగం డిప్యూటీ ఈఓగా రాజేంద్రకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కల్యాణకట్ట డిప్యూటీ ఈఓ సెల్వం అన్నప్రసాదం విభాగానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం పరకామణి డిప్యూటీ ఈఓ రాజేంద్రకుమార్‌ను నియమించారు. నూతన డిప్యూటీ ఈఓను అన్నప్రసాదం ఏఈఓ ఎం. గోపినాథ్, సూపరింటెండెంట్ జీకే రవికుమార్, టీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పూజారి రత్నప్రభాకర్, సిబ్బంది శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



వర్షపు నీటిలో నడిచి వెళుతున్న ప్రజలు

జోరు వాన.. హోరు గాలి



తిరుపతి నగరంలో గురువారం సాయంత్రం గాలీవాన బీభత్సవం సృష్టించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నగరవాసులు భానుడి భగభగలతో అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా వాతారవణ మారిపోయింది. భారీ గాలులతో వర్షం కుమ్మరించింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బలమైన గాలులు వీయడంతో విద్యుత్ స్తంభాలు, ఫ్లెక్సీలు నేలకొరిగాయి. ఇంటిపైనున్న రేకులు ఎగిరిపడ్డాయి. పలుచోట్ల రోడ్లపై చెట్లు విరిగి పడ్డాయి. కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో రోడ్లపై మురుగునీరు ప్రవహించాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



లీలామహల్ సర్కిల్ వద్ద..



తిరుమల బైపాస్ రోడ్డులో..





తుడా సర్కిల్‌లో..



తాతయ్యగుంట గంగమ్మ ఆలయం వద్ద చిరిగిపోయిన టెంట్



వినాయక సాగర్ రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నేలకూలిన వృక్షం

నేటి నుంచి రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్, అఖిల భారతీయ చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీ గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్ వేదికగా మే 26 నుంచి 29వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్ –2023 పోటీలను నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాలర్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ డాక్టర్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో జిల్లా స్థాయి చెస్ చాంపియన్షిప్ పోటీలు నిర్వహించి నలుగురు క్రీడాకారుల చొప్పున అఫిషియల్ ఎంట్రీ ద్వారా, మిగిలిన క్రీడాకారులు స్పెషల్ ఎంట్రీ ద్వారా ఈ టోర్నమెంట్లో పాల్గొంటున్నారన్నారు. జాతీయ స్థాయి సీనియర్ ఓపెన్ చెస్ చాంపియన్షిప్ పోటీల్లో గ్రాండ్ మాస్టర్, ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్స్ కలిగిన క్రీడాకారులు నేరుగా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి జాతీయస్థాయి ఎంట్రీ ఫీజుతో పాటు, ఆడటానికి అవసరమైన ఇతర సబ్సిడీలను ఆర్గనైజింగ్ కమిటీ ఇస్తుందన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

విజయవంతంగా ముగిసిన మహా సంప్రోక్షణ

– టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్



తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో ఐదు రోజులుగా శాస్త్రోక్తంగా చేపట్టిన మహా సంప్రోక్షణ కార్యక్రమం గురువారంతో విజయవంతంగా ముగిసిందని టీటీడీ పాలక మండలి సభ్యుడు పోలక అశోక్‌కుమార్ తెలిపారు. తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతిలో ఎంతో ప్రాశస్తి కలిగిన గోవిందరాజస్వామి ఆలయ విమాన గోపురానికి రూ.32 కోట్లతో బంగారు తాపడం పనులు చేసినట్లు చెప్పారు. ఇందు కోసం 100 కిలోల బంగారం, 4,300 కిలోల రాగి వినియోగించినట్లు తెలిపారు.

గాలీవానపై అప్రమత్తంగా ఉండాలి

- వర్షపు నీరు సాఫీగా నగరం దాటించేలా చర్యలు
- కమిషనర్ హరిత



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: వర్షం, తీవ్ర గాలులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వర్షం ప్రభావంపై గురువారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెను గాలుల వల్ల ఏర్పడిన అంతరాయాన్ని తొలగించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గాలులకు కూలిపోయిన చెట్లను త్వరితగతిన తొలగించాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షపు నీరు నగరం దాటించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కాలువల్లో వ్యర్థాలను తొలగిస్తే వర్షపు నీరు సాఫీగా నగరం దాటుతుందని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్‌ను మరింత మెరుగుపరచాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కమిషనర్ హరిత సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడెక్కడ సమస్యలు ఎదురయ్యాయని అడిగి తెలుసుకున్నారు. ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫోన్ ద్వారా సూచనలిస్తూ ఇబ్బందులు తలెత్తిన ప్రాంతాల్లో వేగవంతంగా సేవలను అందించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, డీఈ విజయకుమార్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి పాల్గొన్నారు.

తిరుమల బస్సు ప్రమాదంపై విచారణ

- మొదటి ఘాట్ రోడ్డులో కాంక్రీట్ రీటైనింగ్ వాల్ నిర్మాణం
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సుబ్బారెడ్డి

తిరుమల: తిరుమల–తిరుపతి మొదటి ఘాట్ రోడ్డులో బుధవారం జరిగిన బస్సు ప్రమాదంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అధికారులను ఆదేశించారు. బస్సు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు, కారణాలపై అధికారులతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మొదటి ఘాట్ రోడ్డులో కూడా కాంక్రీట్‌తో రీటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్సులో సాంకేతిక ఇబ్బంది లేమీ లేవని ఓలెక్ట్రా సంస్థ ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు సమాచారం ఇచ్చారన్నారు. అతివేగం లేదా డ్రైవర్ నిర్లక్ష్యం ప్రమాదానికి కారణమై ఉండొచ్చని, దీని పై విచారణ జరపాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. శ్రీవారి దయ వల్ల బస్సులోని ప్రయాణికులకు పెద్ద గాయాలు కాలేదన్నారు. తిరుమలకు వచ్చిన భక్తులను క్షేమంగా తిరుపతికి చేర్చడానికి టీటీడీ అన్ని భద్రతా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇలాంటి ప్రమాదాలు మరోసారి జరక్కుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే విద్యుత్ బస్సుల డ్రైవర్లకు మరోసారి శిక్షణ ఇప్పించాలని చైర్మన్ సూచించారు. టీటీడీ సీవీఎస్వో నరసింహ కిషోర్, రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం చెంగల్ రెడ్డి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

తిరుపతి కల్చరల్: రామకృష్ణ మిషన్ ఆశ్రమం వద్ద పాదచారులు, యాత్రికులకు గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ఆశ్రమం కార్యదర్శి స్వామి సుకృతానంద మాట్లాడుతూ.. ప్రజాసేవే పరమాత్ముడి సేవ అనే నినాదంతో తిరుపతి ఆశ్రమం ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వేసవిలో ప్రజల సౌకర్యార్థం ప్రతి రోజు ఆశ్రమ ఆవరణలో మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగిస్తామని చెప్పారు. ఆశ్రమ సహాయ కార్యదర్శి స్వామి విశ్వరాజానందాజీ, కమిటీ సభ్యుడు డాక్టర్ జీఎస్. ప్రసాద్ పాల్గొన్నారు.

ఆస్టర్ నారాయణాద్రిలో అత్యాధునిక వైద్య సేవలు



మాట్లాడుతున్న సునంద కుమార్ రెడ్డి

తిరుపతి తుడా: ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో కార్డియో వాస్క్యులర్ కేర్‌లో అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ సునంద కుమార్ రెడ్డి తెలిపారు. రేణిగుంట రోడ్డులోని ఆస్పత్రిలో గురువారం ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్న నారాయణాద్రి హాస్పిటల్, ఆస్టర్ వారితో అనుసంధానమైందన్నారు. అత్యాధిక వైద్య పరికరాలను సమకూర్చినట్లు చెప్పారు. కార్డియోథొరాసిక్ వాస్క్యులర్ సర్జరీలో అత్యంత నైపుణ్యం కలిగిన డాక్టర్ త్రిలోక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. తద్వారా అతి క్లిష్టమైన బీటింగ్ హార్ట్, కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్ట్ (సీఏబీజీ), ఆఫ్ పంప్ బీటింగ్ సర్జరీలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆరోగ్యశ్రీ, ,ఈహెచ్ఎస్, వర్కింగ్ జర్నలిస్టు పథకాలు, టీపీఏ ద్వారా నగదు రహిత వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ ప్రసాద్, డాక్టర్ సుమంత్ రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పాకాల: మేజర్ పంచాయతీ పాకాలలో ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్నట్లు సర్పంచ్ ఎస్.కస్తూరి తెలిపారు. వారం క్రితం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షల క్యాంపు నిర్వహించారని చెప్పారు. అప్పుడు అందుబాటులో లేని వారి కోసం గడప గడపకు వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలను సొంత కుటుంబంగా చూసుకుంటూ వారి ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటున్న ఎమ్మెల్యే దొరకడం అదృష్టమని పేర్కొన్నారు.